# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

### స్పందనకు 145 అర్జీలు : కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:



స్పందన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, నిర్ణియత కాలవ్యవధిలో పరిష్కరిం చాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణా టరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్య క్రమాన్ని జిల్లా నలుమూలల నుండి 145 అర్జీలు వచ్చాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్నికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందన అర్జీలను తరుచూ సమీక్షిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ జయరాములు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## స్పందనకు 216 అర్జీలు

చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంకు జిల్లా నలుమూలల నుండి 216 మంది ప్రజలు హాజరై సమస్యలను విన్నవించుకొన్నారు. ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖకు సంబంధించి 96, ల్యాండ్ రికార్డ్స్ 12, హౌసింగ్ 5, ఆరోగ్యశాఖ 3, పోలీసు శాఖ 2, ఇతర శాఖల నుండి 22 సమస్యలు అందాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబు లేఖలపై కేంద్ర రైల్వే మంత్రి స్పందన

### కుప్పంలో రైళ్లస్టాపింగ్ పరిశీలనకు ఆదేశాలు!!

కుప్పం, డిసెంబర్ 26 ప్రభాతవార్త



కుప్పం రైల్వే స్టేషన్‌లో చెన్నై- షిర్డీ ఎక్స్‌ప్రెస్, పుదుచ్చేరి - దాదర్, మైసూరు - చెన్నై - మైసూరు వందేభారత్ రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని కోరుతూ ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి గత నెల 11న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాసిన విషయం విదితమే. కుప్పం ప్రాంతంలో ఈ రైళ్ల స్టాపింగ్ కేటాయిస్తే అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ లేఖలపై కేంద్ర రైల్వే మంత్రి వైష్ణవ్ స్పందించారు. రైళ్ల స్టాపింగ్ అంశాన్ని పరిశీలించి తగు నివేదికలు తమకు అందించాలని సంబంధిత డైరెక్టరేట్లకు కేంద్రమంత్రి ఆదేశాలు జారీ చేశారు. అన్నీ సాధ్యపడితే త్వరలోనే కుప్పంలో వందేభారత్‌తో పాటు మరో రెండు రైళ్లకు స్టాపింగ్ కేటాయించనున్నారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో పోటెత్తిన భక్త జనం

### శివనామస్మరణతో దద్దరిల్లిన ఆలయం - పాతిక వేల మంది దర్శనం - రికార్డు స్థాయిలో అభిషేకాలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్త జనంతో నిండింది. శివనామస్మరణతో దద్దరిల్లింది. ఆలయం శివరాత్రిని మరపించింది. పాతిక వేల మంది దర్శనం చేసుకున్నట్లు సమాచారం. రికార్డు స్థాయిలో అభిషేకాలు జరిగాయి. అలాగే రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగాయి. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్త తాకిడి అధికంగా చోటు చేసుకుంది. సాధారణంగానే శ్రీకాళహస్తీశ్వరాయలంలో సోమవారం గుక్కతిప్పుకునే వీలు లేని విధంగా ఉంటుంది, ఏ సమస్య అయినా పరిష్కారం అవుతుందనే నమ్మకంతో శ్రీకాళహస్తీశ్వరుని అభిషేకాలు జరిపించుకొనుటకు వస్తుంటారు. అలాగే ఈ ఏడాది కూడా భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. దాంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకున్న అధికారులు ముందు చూపుతో తోసులాట తొక్కిసలాటకు అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నారు.. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకున్న ఇఓ వికె సాగర్‌బాబు సమయస్ఫూర్తితో ముందు చూపుతో ఇన్‌అవుట్ అంటూ చర్యలు తీసుకున్నారు. దాంతో భక్తులు ప్రశాంతతో దర్శనాలు చేసుకున్నారు.



**ఎటు చూసినా శివనామస్మరణే:**

సోమవారం శ్రీకాళహస్తి పట్టణం, ఆలయ పరిసరాల్లోని నాలుగుమాడావీధులు, సన్నిధివీధి, సువర్ణముఖి నది పరిసరాలు ఓంకార నాదం, శివనామస్మరణతో దద్దరిల్లాయి. వేకువ జామునుంచి కర్నాటక, తమిళనాడు నుంచి తరలి వచ్చిన భక్త జనం జీవనది సువర్ణముఖిలో స్నానమాచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. నాలుగు గంటలకే ఇఓ వికె సాగర్‌బాబు ఆలయంలో గోపూజను పర్యవేక్షించారు. సిబ్బందికి బాధ్యతల్ని అప్పగించారు. గోపూజ అనంతరం భక్తుల్ని సర్వదర్శనానికి అనుమతించారు. కాగా ఐదుగంటల నుంచి స్వామిఅమ్మవార్లకు ఆలయం తరఫున అభిషేకాలు ప్రారంభించారు. ఆయన ఆలయంలోని తిష్టవేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పర్యవేక్షించారు. ఇక ప్రసాదాల తయారి కేంద్రంలో సిబ్బందికి ముచ్చెమటలు పట్టాయి. అంచనాలకు మించి భక్తులు రావటంతో భారీ ఎత్తున ప్రసాదాల అమ్మకాలు జరిగాయి.

**రికార్డు స్థాయిలో దర్శనాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం రికార్డు స్థాయిలో దర్శనాలు జరిగాయి. రూ.200 దర్శనం టిక్కెట్లు 1372, రూ.50ల దర్శన టిక్కెట్లు 1711 రాహుకేతుదోష నివారణ పూజలు 3940 అభిషేకాలు 168, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 44 జరిగినట్లు ప్రకటించారు. వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేసారు.

## రూ.కోటి విలువైన

# గంజాయి దగ్ధం

### గంజాయి అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు - తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



రేణిగుంట, డిసెంబరు 26 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం గాజులమండ్యం శివారు ప్రాంతమైన తండ్లంకు వెళ్లే మార్గంలో చిన్న చెరువు వద్ద సోమవారం సాయంత్రం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన 1174.103 కేజీల సుమారు 17 లక్షల 41 వేలు విలువైన గంజాయిని పోలీసులు దగ్ధం చేశారు. రాష్ట్ర బీజేపీ రాజేంద్రరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సూచనలతో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకే గంజాయిని దగ్ధం చేశామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు అక్రమంగా రవాణా చేఇసనా రవాణాకు సహకరించిన చర్యలు కఠినంగా ఉంటాయని తిరుపతి ఎస్పీ హెచ్చరించారు. అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. గ్రామాల మొదలు, పట్టణ, నగరాల వరకు మత్తు పదార్థాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆపరేషన్ పరివర్తనలో భాగంగా అనేక ప్రాంతాలు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అనేక చెక్‌పోస్టుల వద్ద, పలు పోలీస్‌స్టేషన్‌ల్లో పట్టుబడిన గంజాయిని డ్రగ్స్ డిస్పోజబుల్ కమిటీ ఆదేశాల మేరకు ఎస్పీ సూచనలతో దగ్ధం చేసినట్లు అదికారులు స్పష్టం చేశారు. డీసీ శ్రీలత, చిత్తూరు డీఎస్ఈవో మధుమోహనరావు, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్‌లు స్వాతి, రవికుమార్, తిరుపతి ఏఈఎస్ జానకిరామ్, గూడూరు స్టేషన్ల హౌస్ ఆఫీసర్ల సమక్షంలో గంజాయి దగ్ధం చేశారు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి తమ సిబ్బందితో సంఘటనా స్థలం వద్ద ఉన్నారు.

## సమన్వయంతో నూతన సంవత్సరాదికి ఏర్పాటు

### -సామాన్య భక్తులకు దర్శనాలలో ప్రాధాన్యత

### -పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు



కాణిపాకం, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నూతన సంవత్సరాదికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. కాణిపాకం దేవస్థానంలో నూతన సంవత్సరాది, వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో చిత్తూరు ఆర్డీఓ రేణుక అధ్యక్షతన సోమవారం సమన్వయ కమిటి సమావేశం ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాణిపాకం ఆలయంలో నూతన సంవత్సరాది, వైకుంఠ ఏకాదశి సందర్భంగా వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించి కనీస వసతులు కల్పించాలని ఆయా శాఖలను ఆదేశించారు. ఇందులో భాగంగా భక్తలకు త్రాగునీటి వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు భక్తులు కూడా సహకరించాలని మోహన్‌రెడ్డి, వెంకటేశులు తెలిపారు. ఈసమావేశంలో చిత్తూరు ఆర్డీవో రేణుక, ఈఈ వెంకట నారాయణ, తహశీల్దార్ సుశీల, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎస్సై మనోహర్‌లతో పాటు వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోవిడ్ నియంత్రణకు నోడల్ ఆఫీసర్లు

### రెండురోజులలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### 50బెడ్లతో కోవిడ్ కేర్ సెంటర్ సత్వరమే ఏర్పాటు చేయాలి

### - కలెక్టర్ వెంకట రమణారెడ్డి



తిరుపతిరూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

కోవిడ్-19కు సంబంధించిన అంశాలపై నోడల్ ఆఫీసర్లు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజలు కోవిడ్ బారినపడకుండా ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వి.సి. హాలులో డియంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిసిహెచ్ఎస్ ప్రభావతిలతో కలిసి కోవిడ్-19 ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్ల సన్నద్ధతలో భాగంగా ఏర్పాటు చేసిన నోడల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్-19కు నియమించిన నోడల్ ఆఫీసర్ల బాధ్యతతో పనిచేసి కోవిడ్ బారినపడకుండా ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ఉందని, ఎప్పటికప్పుడు ఇచ్చే ఆదేశాలు వాటిపై సత్వర చర్యలు కొరకు కోవిడ్-19 నోడల్ ఆఫీసర్ల గ్రూప్ క్రియేట్ చేయాలని డియంహెచ్ఓను ఆదేశించారు. ఆక్సిజన్ పైప్‌లైన్‌లు పరిశీలించి, పూర్తిస్థాయిలో పనిచేసేలా చేపట్టి నివేదికను అందజేయాలని ఏపియంఐడిసి ఈఈని ఆదేశించారు. మంగళవారం 10 పిహెచ్‌సి, 2ఏరియా ఆస్పత్రి, రుయా, స్విమ్స్, ఈఎస్ఐ, టీచింగ్ ఆసుపత్రిలో మొత్తం 15 కేంద్రాలలో మాక్‌డ్రిల్‌లో భాగంగా 75 కాలమ్స్‌తో కూడిన ఫార్మట్‌లో సమాచారంతో పూర్తిస్థాయిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతానికి 50 బెడ్లుతో కోవిడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డియంహెచ్ఓను ఆదేశించారు. కలెక్టరేట్‌లె కోవిడ్ కంట్రోల్ ఏర్పాటు చేసి, మూడు షిఫ్ట్‌లుగా పని చేసేలా విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండి కోవిడ్-19ను అరికట్టడంలో ప్రజల ప్రాణాలు కాపాడటంలో కంకణ బద్దులై పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డియంహెచ్ఓలు డాక్టర్ సులోచన, డాక్టర్ సుధారాణి, డాక్టర్ యుగంధర్‌రెడ్డి, డిఐఓ డాక్టర్ శాంతకుమారి, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, ఎస్వీఆర్ఆర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, స్విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, డాక్టర్ కిరణ్‌నాయక్, ఏపిఎండిఐసి ఈఈ ధనంజయరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో ఇన్‌ఛార్జి ఇఓ సింఘాల్ తనిఖీలు

### వైకుంఠద్వార దర్శన టోకెన్ భక్తులకు తిరుమలలో కృష్ణతేజ విశ్రాంతి గది వద్ద ఎంట్రీ

తిరుమల, డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు పదిరోజులు విచ్చేసే సర్వదర్శన టైమ్‌స్లాట్ భక్తులు, ఆయా రోజుల్లో సమయానికి కొండకు చేరుకుని, తిరుమలలో కృష్ణతేజ విశ్రాంతి గృహం వద్ద రిపోర్టుచేయాలని టిటిడి ఇన్‌ఛార్జి ఇఓ అనిల్‌కుమార్‌సింఘాల్ తెలిపారు. పదిరోజులపాటు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో జారీచేయనున్న టోకెన్ కౌంటర్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు తదితర వాటిపై టిటిడి ఇన్‌ఛార్జి ఇఓ అనిల్ కుమార్‌సింఘాల్, తిరుపతి జెఇఓ వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు, సివిఎస్ఓ నరసింహకిశోర్‌తో కలసి తిరుమల, తిరుపతిలో భక్తులకు కల్పించే సౌకర్యాలపై తనిఖీ చేశారు.



## నోటీసులతో పెన్షన్లు రద్దు కావు

### - ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్



చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

జిల్లాలో కొంతమంది పెన్షన్ లబ్దిదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని ఈ నోటీసులతో వారి పెన్షన్లకు ఎలాంటి ధోకా వుండదని, అర్హతలకు సంబంధించి విచారించి అర్హులైన వారి వివరాలను రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడం జరుగుతుందని ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ నుండి సోమవారం ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్ ఎంపిడిఓలు, తహసిల్దార్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జీ కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా పెన్షన్లకు అనర్హులుగా గుర్తైతే వారి ధృవపత్రాలను మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓల దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. తహసిల్దార్లు లబ్దిదారుల సర్టిఫికేట్లను సత్వరం జారీ చేయాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరికి సంక్షేమ పథకాలను దూరం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. అలాగే నాడు-నేడు పనుల బిల్లులను సత్వరం అప్‌లోడ్ చేయాలని అధికారులను ఇన్‌ఛార్జీ కలెక్టర్ ఆదేశించారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేయడానికి సిద్ధమైన ట్యాబ్‌లను బుధవారంలోపు విద్యార్థులకు చేర్చాలన్నారు. జిల్లాలో 21 వేల మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయాల్సివుండగా ప్రస్తుతం 7,352 ట్యాబ్‌లను మాత్రమే పంపిణీ చేశారని మిగిలిన ట్యాబ్‌లను రెండు రోజుల్లో సత్వరం పంపిణీ చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 1,183 పాఠశాలల్లో నాడు-నేడుకు సంబంధించి 2,010 పనులు ప్రారంభించడం జరిగిందని, ఈ పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జీ కలెక్టర్‌తో పాటు డిఇఓ వేజయేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# మా భూములకు మీ బొమ్మలేంటి జగన్‌రెడ్డి

### మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి ఆగ్రహం



పెద్దపంజాణి డిసెంబర్ 26 ప్రభాతవార్త :

మనతాతల మనభూములకు సిఎం జగన్‌రెడ్డి బొమ్మలేయడం, భూములకు సంభందించిన భూపట్టా పుస్తకాలపై బొమ్మలేయడం ఏంటని మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసారు. సోమవారం చిత్తూరుజిల్లా పెద్దపంజాణి మండలం ముత్తుకూరులో తెలుగుదేశంపార్టీ చేపట్టిన ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలు, కర్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పులివెందులలోనో, ఇడుపులపాయలోనో ఉన్నభూములకు సిఎం జగన్ రెడ్డి బొమ్మలేసుకోవచ్చుగానీ రాష్ట్రంలోవున్న రైతులు, ప్రజల భూములకు ఆయన బొమ్మలు వేసుకోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. కేవలం చంద్రబాబు నాయుడు హయాంలో కట్టిన భవనాకు వైకాపా ప్రభుత్వం రంగులేసే కార్యక్రమం తప్ప మిగతా ఏంచేసిందని ప్రశ్నించారు. సమగ్రభూసర్వే చేపట్టిన ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పాసుపుస్తకాలలో తప్పులతడకాగా భూములు వివరాలు నమోదుచేసి ఇస్తున్నారని విమర్శించారు. ఇదికేవలం చిల్లర్లకోసమేననీ ఆరోపించారు. పాతికేళ్ళ క్రితం చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్న సమయంలో దేశంలోనే తొలిసారిగా ఇజ్రాయిల్ తరహా వ్యవసాయాన్ని రాష్ట్రంలో అమలుచేసి డ్రిప్‌విధానం పద్ధతిని రైతులకు అందుబాటులో తెచ్చామన్నారు. నేడు అలాంటి డ్రిప్‌పరికరాలను మూడేళ్ళలో మూడు మీటర్లుకూడా సిఎం జగన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఇది ప్రభుత్వానికి సిగ్గుగాలేదా అని ప్రశ్నించారు. తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకునే సిఎం జగన్ రెడ్డి రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. సిఎం జగన్ రెడ్డి, విద్యుత్‌శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిలు రైతుల మోటార్లకు మీటర్లు బిగిస్తున్నారని ఇది రైతుల మెడలకు ఉరితాళ్ళని పేర్కొన్నారు. మీటర్ల ఏర్పాటు పేరిట 4వేలకోట్లు రైతుల నెత్తిన రుద్దడం భావ్యం కాదన్నారు. నాణ్యమైన విధ్యుత్ సరఫరా, విధ్యుత్ చౌర్యం నివారణకు మీటర్లు బిగిస్తాయని ప్రభుత్వపెద్దలు పేర్కొనడం దారుణమన్నారు. గతంలోనే చంద్రబాబు నాయుడు ఎస్‌విడిఎస్ విధానాన్ని అందుబాటులో తెచ్చారని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వానికి రైతులపై సందేహంఉంటే ఏప్రాంతంలో ఎంతవిధ్యుత్ సరఫరా అవుతుందో సబ్‌స్టేషన్‌లో మీటర్లు పెడితే తెలుస్తుందికదాఅని పేర్కొన్నారు. రైతులు సిఎం జగన్ రెడ్డి మోసం చేయడం సబబుకాదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పర్యటనలకు జనంబ్రహ్మరథంపడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా మరలా చంద్రబాబునాయుడు సిఎం కావడం థద్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజలంతా చంద్రబాబు పాలనపై ఆసక్తి చూపుతున్నారని మూడున్నరేళ్ళ వైకాపా పాలనపై ప్రజలు విసుగెత్తి ఇదేంఖర్మరా రాష్ట్రానికి అంటూ ఆవేధనవ్యక్తంచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువతఅధ్యక్షుడు నాగిరెడ్డి, ఆనంద్, చలపతి, మాజీ ఎంపిపి మురళీకృష్ణ, సుధాకర్ రెడ్డి, జయరాం రెడ్డి, మురహరి రెడ్డి, కోగిలేరు చెంగారెడ్డి, వరలక్ష్మి, కృష్ణారెడ్డి, వేణుగోపాల్ నాయుడు, రుద్రమూర్తి నాయుడు, ముబారక్, కెలవాతి సుబ్రమణ్యం, గంగప్ప అధికసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



గుడిపాల, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చర్యలు తీసుకొంటున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సోమవారం 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన అనంతరం విద్యా వ్యవస్థలో పలు మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి నిరుపేదకు నాణ్యమైన కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యంగా సిఎం పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ జనార్దన్, ఎంపిడిఓ ఉపేంద్ర, ఎంఇఓ రామ్‌నాయక్, హెడ్మాస్టర్ సబర్మతి, సర్పంచ్ రజనీకాంత్, నాయకులు శింబు, మొగిలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు పక్కాగా సేవలు : జెడ్పీ సిఇఓ



చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

వార్డు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు పక్కాగా సేవలు అందించాలని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. చిత్తూరు ఇరువారంలోని 20వ డివిజన్ వార్డు సచివాలయంను సోమవారం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారులు, అనర్హుల జాబితాను నోటీస్ బోర్డులో డిస్‌ప్లే చేయాలన్నారు. సంక్షేమ పథకాలు ఎవరికైతే అందలేదో వారికి ఎందుకు అందలేదనే విషయంను తెలియజేయాలన్నారు. అలాగే జడ్పీ సిఇఓ వార్డు సచివాలయంలోని రికార్డులను తనిఖీ చేసి రికార్డులను పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

## భవిత కేంద్రం తనిఖీ

గుడిపాల, డిసెంబర్ 26 ప్రభాతవార్త: మండలంలోని భవిత కేంద్రంను సోమవారం సహిత విద్య సమన్వయకర్త ప్రభాకర్ వర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలో విద్యార్థులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు కేంద్రంలో ఆహ్లాదకర వాతావరణం వుండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది భవిత వాణి, ఆముద తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయంలో విధులకు హాజరుకాని ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థకు పాలసముద్రం మండలంలోని వనదుర్గాపురం గ్రామ సచివాలయ సిబ్బంది తిలోదకాలు ఇస్తున్నారు. సచివాలయంలో విధులు నిర్వర్తించే ఆరోగ్య సిబ్బంది జాడ సోమవారం సచివాలయంలో కన్పించలేదు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విధులకు హాజరై ప్రజలకు సేవలు అందించాలని జిల్లా ఉన్నత అధికారులు కంఠశోష పెడ్తున్నా ఫలితం కన్పించడం లేదు. గ్రామ సచివవాలయం పరిధిలో ఒక ఎంఎల్‌హెచ్‌పి, ఒక ఎన్‌ఎం, ఒక ఆశా వర్కర్ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే సోమవారం ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎంలు మధ్యాహ్నం వరకు విధులకు హాజరు కాకపోవడంతో కొంతమంది ప్రజలు సచివాలయంకు వెళ్లి వెనక్కి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా ఉన్నతాధికారులు చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## మైనార్టీ పోలీస్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

మైనార్టీ పోలీస్ అభ్యర్థులకు జిల్లా అంజుమాన్ కమిటీ పలు సౌకర్యాలు కల్పిస్తోందని జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ ఛైర్మన్ గఫార్ తెలిపారు. చిత్తూరు ప్రభుత్వ కన్నన్ జూనియర్ కళాశాలలో ఈ శిక్షణ కార్యక్రమంను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ ఛైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఈ శిక్షణలో మైనార్టీ విద్యార్థులే కాకుండా ఇతర విద్యార్థులు సైతం పాల్గొని శిక్షణ పొంది పోలీసు ఉద్యోగాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేటర్లు, కో-అప్షన్ సభ్యులు, అంజుమన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వివరాలకు రిటైర్డ్ ఎస్ఐ రషీద్ నెం.91823 43231 సంప్రదించాలని ఆయన కోరారు.

## చెరువుల వేలంతో భారీగా పంచాయతీలకు ఆదాయం

పాలసముద్రం, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

మండలంలోని చెరువుల వేలంతో పంచాయతీలకు భారీగా ఆదాయం లభించింది. ఇఓఆర్డీ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ చెరువుల వేలం నిర్వహించారు. గతంలో 'పంచాయతీల ఆదాయంకు గండి' అనే శీర్షికతో 'ప్రభాతవార్త'లో వార్త ప్రచురితం కావడంతో అధికారులు నెల రోజుల గడువు తీసుకొని సోమవారం చెరువుల వేలం నిర్వహించారు. వనదుర్గాపురం పంచాయతీ పరిధిలోని రెండు చెరువుల వేలం ద్వారా పంచాయతీకి 1.68 లక్షల రూపాయల ఆదాయం లభించింది. జాతీయ మానవ హక్కుల మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్ మాట్లాడుతూ గత ఏడాది రెండు చెరువుల వేలం ద్వారా పంచాయతీకి కేవలం 25 వేల రూపాయలు ఆదాయం లబించిందని ప్రస్తుతం వేలం పాటలో అందరు పాల్గొనడంతో పోటీ పెరిగి 1.68 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. ఈ వేలం పాటల్లో ఇఓఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సర్పంచ్ నరసింహరాజు, మహిళా పోలీస్ సరిత, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు - ఎమ్మెల్సీ భరత్



రామకుప్పం, డిసెంబర్ 26 ప్రభాతవార్త

అర్హులైన పేదలకు నవరత్నాలు పథకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. సోమవారం చెల్దిగానిపల్లిలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం ఆయన చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. 2024లో ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇస్తే ముఖ్యమంత్రి జగనన్న చొరవతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ భరత్‌కు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, నేతలు చెంగారెడ్డి, కేశవరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, సర్పంచులు మురళి, రాజగోపాల్, మల్లిక గోవిందప్ప, నారాయణస్వామి, అప్పి, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్ కట్టెలదొడ్డి వద్ద ఆదివారం జరిగిన అశోక్‌కుమార్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అశోక్‌పై శరవణ, శివలు కత్తితో దాడి చేసినట్లు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ మల్లికార్జున ఈ కేసులో నిందితులు ఇద్దరిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## మణికంఠేశ్వరాలయంకు వెండి ఆభరణాల విరాళం



కాణిపాకం, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంకు సోమవారం ఓ భక్తుడు వెండి ఆభరణాలను విరాళంగా అందజేశారు. గుంటూరుకు చెందిన వెంకట రామయ్య అనే భక్తుడు మణికంఠేశ్వరస్వామి, మరగదాంభిగా అమ్మవార్లకు 80 వేల రూపాయల వ్యయంతో 1 కిలో 300 గ్రాముల వెండితో ప్రత్యేకంగా తయారు చేయించిన కరీటం, 4 హస్తములు,4 పాదములను విరాళంగా అందజేశారు. వీటిని ఆలయ సూపరెండెంట్ కోదండ పాని, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## 205రోజుకు చేరిన అన్న క్యాంటీన్ అన్నదానం



కుప్పంరూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త

కుప్పం ఎన్టీఆర్ విగ్రహం వద్ద మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా చేపడుతున్న అన్నదాన కార్యక్రమం సోమవారంతో 205రోజులు పూర్తి చేసుకుంది. ఎన్టీఆర్ ట్రస్ట్, తెదేపా నేతలు, దాతల విరాళాలతో రోజుకు500మందికి పైగా ప్రజలకు ఇక్కడ అన్నదానం జరుపుతున్నారు. కార్యక్రమంలో మాజీ తెదేపా పట్టణ అధ్యక్షుడు పిఎస్ సతీష్‌కుమార్, ఐటిడిపి అధ్యక్షుడు నరేష్, లక్ష్మీపురం రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి



శాంతిపురం, డిసెంబర్ 26 ప్రభాతవార్త

గ్రామ స్థాయిలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నేతలు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక బాలాజీ కళ్యాణమండపంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, పంచాయతీల అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలవద్దకు నేతలు, కార్యకర్తలు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు వివరించాలన్నారు. చంద్రబాబు కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామస్థాయిలో కార్యకర్తలపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తెదేపా క్రమశిక్షణ గల పార్టీ అన్నారు. ఈసారి మరలా చంద్రబాబు సిఎం కావడం తథ్యమన్నారు. కార్యకర్తలు, నేతలు నిందారోపణలు చేసుకోక కలసికట్టుగా పనిచేయాలని మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, ఎల్.జయరాంరెడ్డి, ఈడిగ రమేష్, రాజు,ఉయ్యాలజయరాంరెడ్డి, మణి, రాజారెడ్డి, కోద ఎడప్ప, రవి, రాధాకృష్ణ, సుగుణమ్మ, అనసూయ, చంద్రకళ పాల్గొన్నారు.

## హంద్రీ-నీవా కాలువ పనులు జడ్పీటిసిచే పరిశీలన



శాంతిపురం, డిసెంబర్ 26 ప్రభాతవార్త

మండలంలోని గుండిశెట్టిపల్లి వద్ద జరుగుతున్న హంద్రీ-నీవా కాలువ పనులను సోమవారం జడ్పీటిసి శ్రీనివాసులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు అనుసరిస్తూ త్వరలోనే కుప్పంకు కృష్ణాజలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, వైకాపా నేతలు, రైతులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

### -పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు



తవణంపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. సోమవారం మండలంలోని గోవిందరెడ్డిపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని కట్టకిందపల్లె ఎస్టీ కాలనీ, తుమ్మానుమిట్ట, ఎ.గొల్లపల్లె, కట్టకిందపల్లె గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.హరిప్రసాద్‌రెడ్డి, తహశీల్దార్ సుశీల, డిప్యూటీ తహశీల్దార్ రమణ, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, వైకాపా మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, పుణ్యసముద్రం రవిప్రసాద్, పరమేశ్వరరెడ్డి, అరగొండ కిషోర్‌కుమార్‌రెడ్డి, వినోద్ యాదవ్, రవిరెడ్డి హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, అమరావతి, సుబ్రమణ్యంరెడ్డి, ఏపీఎం రవి, ఏపీఓ లలితలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



సదుం,డిసెంబరు 26ప్రభాతవార్త

మండల పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం ఫత్తేగడ పంచాయతీ కుక్కలోడు గ్రామానికి చెందిన శ్రీరాములు కుమారుడు జయరాం(48) అనే వ్యక్తి పీలేరుకు వచ్చి తన కుమారుడికి కాలేజీలో పీజు కట్టి తిరిగి కలికిరికి వెళుతుండగా మార్గమధ్యంలో సదుం మండలం అంకాలమ్మగుడి మలుపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈఘటనలో అతని తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని మృత దేహాన్ని పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు శవపరీక్ష నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు.

## మల్లేశ్వరస్వామికి విశేష పూజలు

కల్లూరు,డిసెంబరు26ప్రభాతవార్త

పులిచెర్ల మండలంలోని జాంద్రపేటలోగల శ్రీమల్లేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగ ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు. అమెరికాకు చెందిన గిరిధర్, శ్రీదేవి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉబయదారులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## సీజ్‌చేసిన వాహనాల వేలంతో ఆదాయం 3.47లక్షలు

పెద్దపంజాణి డిసెంబర్ 26 ప్రభాతవార్త :

పెద్దపంజాణిమండల పరిధిలో సెబ్‌నేరాలు,ఇతర వివిధనేరాలకు సంబందించిన కేసులలో ఇదివరకు పోలీసులుసీజ్‌చేసిన వాహనాలను సోమవారం ఎస్సై స్వర్ణతేజ ఆధ్వర్యంలో బహిరంగవేలం నిర్వహించినట్లు తెలిపారు.ఈ వాహనాల వేలంద్వారా 18% జిఎస్టీతో కలిపి సుమారు3.47లక్షల ఆధాయం లభించిందిన్నారు.ద్విచక్రవాహనాలు08,ఆటోలు02,మెత్తం10వాహనాలను బహిరంగవేలం నిర్వహిచినట్లు ఆమె తెలిపారు.

## లోక సుభిక్షం కోసమే పాదయాత్ర : వీరశైవ లింగాయత్



చౌడేపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త

లోకం సుభిక్షింగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే పత్తికొండ-శ్రీశైలం పాదయాత్రను చేపట్టినట్లు వీరశైవ లింగాయత్ సంఘ రాష్ట్ర నాయకుడు ఠాణేదార్ నాగరాజ అన్నారు. సనాతనధర్మ పరిరక్షణ, సాంప్రదా య పద్ధతులు నేటి తరాలకు తెలిపే ప్రయత్నమే పాదయాత్ర ముఖ్యవుద్దేశ్యమన్నారు. నాయకులు చారాల ముత్తు, ఠాణేదార్ బసవరాజ, లక్కూరి నాగరాజ, తదితరులు యాత్రకు సంఘీభావం తెలిపినవారిలో వున్నారు.

## ట్యాబ్‌లు పంపిణీ

చౌడేపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త

స్థానిక ఉన్నతపాఠశాలలో మండలంలోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసారు. కార్పోరేట్‌స్థాయి డిజిటల్ విద్యనందించాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తోందని వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. మండల వ్యాప్తంగా గల 572మందికి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు. మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ముని తుకారామ్, రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, జడ్పీటీసీ ఎన్.దామోధర్‌రాజు, ఎంపిపి జి.రామ్మూర్తి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, సర్పంచు శ్రీరామ్ భరత్ వరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైకాపా నాయకులు, ఎంపిటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వచ్చే ఎన్నికల్లో వైసీపీదే విజయం

### - గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు

కోట, డిసెంబర్ 26 ప్రభాతవార్త

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి కోట మండలం సిద్ధవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అమలుపరిచిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన కరపత్రాలను ఒక్కొక్క లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధిపొందాడో అనే కరపత్రాలను ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ మారెళ్ల భవాని, మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డిసిసిబి డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## నెలబల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

దొరవారిసత్రం, డిసెంబర్ 26 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నెలబల్లి గ్రామంలో ఉదయం 7 గంటల నుంచి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో గడప గడపకు తిరిగి వైసీపీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. వీరితో పాటు ఎంపిడిఓ శింగయ్య, నాయకులు మునస్వామినాయుడు, సురేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నాయుడుపేట ఎడిఎగా సుచేంద్రప్రసాద్ ...

నాయుడుపేట రూరల్ డిసెంబరు 26 ప్రభాతవార్త;

నాయుడుపేట వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఎడిఎగా సుచేంద్రప్రసాద్ సోమవారం భాధ్యతలు స్వీకరించారు.ప్రస్తుతం నాయుడుపేట ఎడిఎగా పనిచేస్తున్న హైమావతి సెలవుపై వెళ్ళడంతో చిట్టమూరు ఎవోగా పనిచేస్తున్న సుచేంద్రప్రసాద్‌ను నాయుడుపేట ఇన్‌చార్జి ఎడిఎగా నియమించారు.ఈసందర్భంగా ఇన్‌చార్జి ఎడిఎ సుచేంద్రప్రసాద్ మాట్లడుతూ వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుభాటులో వుండి వ్యవసాయసాగులో తీసుకోవాల్సి మెళుకువలపై పూర్తిస్తాయిలో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.అంతేకాకుండా రైతులకు సబ్సీడి ద్వారవచ్చే పరికరాలు,ఎరువులను సకాలంలో అందరికి అందించడం జరుగుతుందన్నారు.ఆయన వెంట నాయుడుపేట ఎవో గణేష్,వ్యవసాయశాఖ అధికారులు,సిబ్బంది,తదితరులు ఉన్నారు.

## అకారణంగా రద్దు చేసిన రేషన్‌కార్డులు, పింఛన్లు పునరుద్ధరించాలి

వాకాడు, డిసెంబర్ 26, ప్రభాతవార్త

వాకాడు మండలంలోని వివిధ కారణాలు చూపుతూ రద్దు చేసిన రేషన్ కార్డులు, సామాజిక ఫించన్లు వెంటనే పునరుద్దరించాలని, వాకాడు మండలం టిడిపి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. సోమవారం ఉదయం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు దువ్వూరు మధుసూధన్ రెడ్డి అధ్యక్షతన ఎంపిడిఓ, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుందంటూ నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు డి. మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా సామాజిక పింఛన్లు తీసుకుంటున్న వారిని నేడు వివిధ కారణాలు చూపుతూ పెన్షన్ దారులకు నోటీసులు ఇవ్వడం విచారకరమని, విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉందని చార్జీలు ఎక్కువ చెల్లిస్తున్నారంటూ, రేషన్ కార్డులు, పింఛన్లు తొలగిస్తున్నట్లు పింఛన్ లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసారు. విచారణ జరిపి అర్హులకు నష్టం జరగకుండా చూడాలని ఆయన కోరారు. అనంతరం ఎంపిడిఓ గోపినాధ్, ఇంచార్జి తహశీల్దార్ సారంగపానిలకు వినతి పత్రాలు అందజేసారు. కార్యక్రమంలో కుంచం దయాకర్, అన్న మేటి చంద్రయ్య, అయోధ్య చంద్రయ్య శెట్టి, మామిడి గోవిందయ్య, రఘు, తీపలపూడి రమణయ్య, కుంభాల రమణయ్య, పంట్రాంగం అరుణ్ కుమార్, రమణయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

### తెదేపా నాయకులు తూపిలి రాధాకృష్ణారెడ్డి



కోట,డిసెంబర్ 26 ప్రభాతవార్త

మూడున్నరేళ్ల పరిపాలనలో వైకాపా ప్రభుత్వం అప్పుల ఊబిలో కరుకుపోయిందని రాష్ట్రం అభివృద్ధి చెందాంటే తిరిగి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావాలని తిరుపతి జిల్లా తెదేపా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి అన్నారు. ఆయన సోమవారం కోటలో విలేకర్లుతో మాట్లడుతూ రాష్ట్రంలో సురక్షిత పరిపాలన అభివృద్ధి జరగలంటే వైకాపా ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పి చంధ్రభాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు.పోలీసులను అడ్డం పెట్టుకుని పరిపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఒక్క అవకాశం ఇచ్చి మోసపోయామని మళ్లీ వైకాపా అధికారం కట్ట బెడితే వందేళ్ల వెనక్కి పోవాల్సి వస్తుందన్నారు. పేదలకు సామాజిక పింఛన్లు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించి మరో వైపు వివిధ కారణాలతో రద్దు చేయడమేమిటిని ఆయన ప్రశ్నించారు.ప్రతి సచివాయలంలో 20 పింఛన్లు రద్దు చేశారని ఆయన ఆరోపించారు.ఇప్పటికి కోట మండలంలో 256 మందికి నోటీసులు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు.ఇప్పటికే అనేక ప్రజా వ్యతిరేక అభివృద్ది నిరోధక నిర్ణయాలతో ప్రజాగ్రహానికి గురువుతున్న వైకాపా ప్రభుత్వం తొలిగించిన పింఛన్లు సరిదిద్దుకొకపోతే ప్రజా క్షేత్రంలో శిక్షకు గురికాక తప్పదని రాధకృష్ణారెడ్డి హెచ్చరించారు.

## స్పందనలో వచ్చిన సమస్యలకు స్పష్టమైన పరిష్కారం

### - వైసీపీ మండల కన్వీనర్ ఢిల్లీ బాబు



వెంకటగిరి, డిసెంబరు 26, ప్రభాతవార్త: స్పందనలో సమస్యలపై వచ్చిన వినతిప త్రాలను పరిశీలించి త్వరగా పరిష్కరి స్తామని పట్టణ వైసీపీ కన్వీనర్, 21వ వార్డు కౌన్సిలర్ అయిన గుమ్మలపు ఢిల్లీ బాబు తెలిపారు. 21వ వార్డులోని సచివా లయంలో ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో పలు సమస్యలపై వార్డు ప్రజలు వినతిపత్రాలు సమర్పించినట్లు చెప్పారు. వీధి దీపాలు, పింఛనుదారులకు నోటీసులు వంటి వాటిపై వినతిపత్రాలు అందజేశారు. అర్హులైన వారికి పెన్షన్ రద్దు కాదని తెలిపారు. స్పందనలో వచ్చిన సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకునివెళ్లారు.

## రైతులు నెలాఖరులోగా ఈకేవైసి చేయించుకోవాలి

కోట,డిసెంబర్ 26 ప్రభాతవార్త

కోట మండలంలోని రైతులంతా ఈనెలాఖరిలోపాల ఈకేవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకర్లుతో మాట్లాడుతూ 13 వ విడత రైతు ఖాతాల్లోకి పిఎంకిసాన్ నిధులను కేంద్ర ప్రభుత్వం రైతు ఖాతాల్లోకి జమ చేస్తోందని ఆయన తెలిపారు.జనవరిలో రైతులకు పిఎంకిసాన్ నిధులు విడుదలు అవుతాయన్నారు. వారి బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అనుసందానం కాలన్నారు. రైతులు ఇంకా ఈకేవైసి చేయించుకోకుండా ఉన్న వారు ఈనెల 31 లోపాల ఆయ రైతు భరోసా కేంద్రాల్లో, మీ సేవ కేంద్రాల్లో నమోదు చేసుకొవాలన్నారు.

## పెద్ద మసీదు అభివృద్ధికి నిధులు కోరిన కమిటీ ఛైర్మన్, సభ్యులు



వెంకటగిరి, డిసెంబరు 26, ప్రభాతవార్త:

పెద్ద మసీదు అభివృద్ధికి నిధులు కావాలని ఎమ్మెల్యే ఆనం రామనారాయణంరెడ్డికి కమిటీ ఛైర్మన్ గౌస్‌బాషా, సభ్యులు కోరారు. శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, జామియా మసీదు కమిటీ సభ్యులు ఎస్.డి.చాన్‌బాషా ఆధ్వర్యంలో కమిటీ నాయకులు ఆనంను కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందించిన పలు సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

దుకాణాల్లో తూనికలు కొలతల అధికారుల దాడులు

వెంకటగిరి పట్టణంలోని పలు దుకాణాల్లో తూనికలు కొలతలు అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. తూకాలు ఉపయోగించే తూనికల గుండ్లను పరిశీలించారు. సక్రమంగా తూకం లేని దుకాణాల వారిపై కేసులు నమోదు చేశారు.

## కోవిడ్ పై సమావేశం



వాకాడు, డిసెంబర్ 26, ప్రభాతవార్త

మండలంలోని ప్రతి ఒక్కరికి ఏఎన్ఎంల ద్వారా నాలుగో విడత కోవిడ్ పై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపిడిఓ గోపినాధ్ ఆధ్వర్యంలో మండల స్థాయి వైద్యాధికారులు, అధికారులు కోవిడ్ పై టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎంపిడిఓ గోపినాధ్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో శానిటేషన్ చేయించాలని, ముఖ్యంగా కోవిడ్ ఇంజక్షన్ వేసుకుని వారి వివరాలు వాలంటీర్లు, టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు సేకరించాలన్నారు. బూస్టర్ డోస్ అందుబాటులో ఉంటుందని వేయించుకుని వారి వెంటనే ఆయా ఏఎన్ఎంలను సంప్రదించి బూస్టర్ డోసు వేసుకోవాలన్నారు. అన్ని గ్రామాలలో కోవిడ్ పై అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఒక్కరు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రఘునాథ్, వైద్యాధికారిణి దీప్తి, ఈఓపిఆర్‌డి ఉమామహేశ్వర రావు, రెవిన్యూ ఇన్స్‌క్టర్ సెల్వరాజ్ తదితరులు ఉన్నారు.

## కరోనా కట్టడికి ముందస్తు సమావేశం



పెళ్లకూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త

కరోనా ఫోర్త్ వేవ్ నిరోధానికి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో కరోనా ఫోర్త్‌వేవ్ నియంత్రణకు ముందస్తు చర్యలపై చర్చించారు. ఆయా గ్రామాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని తహశీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సురేష్‌బాబు, స్థానిక ఎస్ఐ సిహెచ్ కృష్ణారెడ్డి, వైద్యాధికారి టికె ఉమా, పెళ్లకూరు పిహెచ్‌సి సిహెచ్‌ఓ శివారెడ్డి తదితరులు ఉన్నారు.

## రామాపురంలో దాడి, ఒకరికి గాయాలు

తడ, డిసెంబర్ 26 ప్రభాతవార్త

తడ మండలం రామాపురంలో ఆంబాకం షణ్ముగం అనే రైతుపై పెరియవట్టుకు చెందిన ఆనంద్ దాడి చేసినట్లు తడ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు, పొలాలు దగ్గర దగ్గరగా ఉన్న ఈ రైతుల మద్య వివాదం గొడవకు దారితీసింది. పైరుపై యూరియా చల్లే క్రమంలో ఒకరికొకరు వాదులాడుకొని కొట్టుకునే దాకా వెళ్లింది. పొలంలో జరిగిన గొడవ కారణంగా ఆనంద్ ట్రాక్టర్ సైలెన్సర్ తీసుకొని షణ్ముగంపై దాడి చేయడంతో అతని ఎడమచేయి మీద గాయమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నేడు బడిపిల్లలకు ట్యాబ్‌లు పంపిణీ

తడ, డిసెంబర్ 26 ప్రభాతవార్త

తడ మండలంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం జరిగే ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు మండలాల్లో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. మంగళవారం జరిగే కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నట్లు మండల స్థాయి అధికారులు తెలిపారు.

## రైతులకు అందుబాటులో 650 టన్నుల యూరియా

### - ఏడీఏ నాగార్జునసాగర్



వెంకటగిరి, డిసెంబరు 26, ప్రభాతవార్త:

వెంకటగిరి సబ్ డివిజన్ పరిధిలోని డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల్లోని రైతులకు 650 టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు సొసైటీ ద్వారా రైతులు యూరియా తీసుకోవచ్చని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొచ్చి యూరియా పొందవచ్చన్నారు. యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## ఆత్మాభిమానమా..? అహం బావమా..?

### చంద్రగిరికి పాకుతున్న బిజెపి వర్గపోరు-బిజెపి జిల్లా అధ్యక్షుడి వితండవాదం

చంద్రగిరి, డిసెంబర్ 26 ప్రభాతవార్త: పట్టుమని పాతిక మంది కార్యకర్తలు లేని బిజెపిలో గత కొంత కాలంగా సాగుతున్న వర్గపోరుతో ప్రజలు నవ్విపోతున్నారు. చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పార్టీ అధికారికంగా నియమించనప్పటికీ గత కొన్ని నెలలుగా మేడసాని పురుషోత్తం నాయుడు ఇన్‌చార్జ్‌గా చలామణి అవుతూ తన అనుచరులతో కలసి చంద్రగిరిలో తరచూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అయితే నియోజకవర్గ ఇన్‌చార్జ్ హోదాలో ఆయన నిర్వహించే కార్యక్రమాలకు చంద్రగిరి మండలానికి చెందిన బిజెపి నాయకులు, కార్యకర్తలు హాజరుకాకపోవడం ద్వారా వర్గపోరు జరుగుతున్నట్లు అవగతమవుతున్నది. క్రమశిక్షణ కలిగిన పార్టీగా చెప్పుకునే బిజెపి నాయకులు ఏ మండలానికి వెళ్ళినప్పటికీ అక్కడి పంచాయతీ బిజెపి అధ్యక్షుడు మొదలుకుని మండల అధ్యక్షుడిని, కార్యకర్తలను కలుపుకుని కార్యక్రమాలను నిర్వహించాల్సి వున్నది. అయినా ఇది అమలుకు నోచుకోకపోవడంతో ఇక్కడ ఎవరిది ఆత్మాభామానం, ఎవరిది అహం భావం అనేది అర్థం కావడం లేదనే చర్చ సాగుతున్నది.

**-మీకేం సంబంధం.. బిజెపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు**

చంద్రగిరిలో ఆదివారం బిజెపి నాయకులు రెండు ప్రదేశాలలో మాజీ ప్రధాని వాజ్‌పాయ్ జయంతి వేడుకలు నిర్వహించడాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు దృష్టికి తీసుకెళ్ళగా మీకేం సంబంధం అంటూ ఎదురు ప్రశ్నించారు. ఎవరు ఎక్కడైనా వేడుకలు జరుపుకోవచ్చని సెలవిచ్చారు. అసలు వాజ్ పాయ్ జయంతి వేడుకలు పార్టీ కార్యక్రమమే కాదన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నిర్ధారిస్తూ మేడసాని పురుషోత్తం నాయుడు ఎక్కడైనా కార్యక్రమాలు చేసుకోవచ్చన్నారు.

**-అధికారికంగా నియమించలేదు.. బిజెపి రాష్ట్రష కౌన్సిల్ సభ్యుడు మధుబాబు**

మేడసాని పురుషోత్తం నాయుడును నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా అధికారికంగా నియమించలేదని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మధుబాబు అన్నారు. నియోజకవర్గంలో అందరిని కలుపుకుని పార్టీ కార్యక్రమాలను నిర్వహించాలని మేడసానికి పార్టీ సూచించినట్లు తెలిపారు. వాజ్‌పాయ్ జయంతి వేడుకలు వేర్వేరుగా నిర్వహించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

## పేదలకు భూములు పంచిన చరిత్ర సీపీఐదే

పుత్తూరురూరల్, డిసెంబరు 26 ప్రభాతవార్త: భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ 98వ వ్యవస్థాపక వేడుకలు పుత్తూరులో ఎర్రజెండాను ఎగురవేసి ఘనంగా నిర్వహించుకున్నారు. తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యం నుంచి దేశాన్ని విముక్తి చేయడం కోసం 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో పురుడు పోసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ బ్రిటీష్ పాలకుల నుంచి అనేక నిర్బంధాలను కుట్ర కేసులను భరించిందని గుర్తు చేశారు. ఈ దేశానికి ఆహార భద్రత చట్టం, కార్మిక హక్కుల చట్టం తీసుకొచ్చిన ఘనమైన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. నిరుద్యోగం పెంచి పోషించడం, కార్మిక హక్కులు కాలరాయడం, దళితులు, గిరిజనులు మైనారిటీలపై దాడులు చేయడం అధిక ధరలు నియంత్రించక లేకపోవడంతో పాటు అనేక రకాల ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకొచ్చి దేశాన్ని కార్పొరేట్ పెట్టుబడి దారులకు తాకట్టు పెడుతున్నాడని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ పుత్తూరు పట్టణ కార్యదర్శి మహేష్, నాయకులు సెల్వరాజ్ ఆచారి, కృష్ణారెడ్డి, రవి, బాబి, యువరాజ్‌లు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు డిఎస్పీ అభినందనలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : గతనెల జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనపర్చిన క్రీడాకారులు ఈనెల విజయవాడలోని కృష్ణ లంకలో 22 నుంచి 24వరకు జరిగిన టేబుల్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న అజయ్, జయంత్, చైతన్యసాయి, గణేష్, వేణుమాధవ్‌లు అండర్-19 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపర్చి చిత్తూరుజిల్లా 4వ స్థానం కైవసం చేసుకుంద న్నారు. డిఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్ మాట్లాడుతూ క్రీడల పట్ల పలు ఉపయోగాలు ఉన్నాయని క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడంతోపాటు విద్యకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో, క్రీడలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విద్యార్థులు చెడు అలవాట్లకు గురికాకుండా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు రాజేశ్వరి, పిడి,పిఇటి వెంకటముని, సరోజినీ, ఇందిర, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## 132మంది ఫింఛనుదారులు అనర్హులుగా గుర్తింపు?

తొట్టంబేడు, డిసెంబర్ 26 ప్రభాతవార్త : మండలంలోని పలు పంచాయతీల్లోని గ్రామాలకు చెందిన 132మంది ఫించనుదారులకు అనర్హులుగా గుర్తించినట్లు సంబందిత అధికారులు తెలిపారు. అయితే వీరు నిజంగా అర్హులా కాదా అని సంబందితశాఖాధికారులు ఇచ్చే నివేదికను బట్టి ఉంటుందన్నారు.

## మణిపాల్ గ్లోబల్ స్కిల్స్ అకాడమీ ద్వారా...దేశంలో లక్ష ఉద్యోగాలు

తిరుపతి(విద్య),డిసెంబర్ 26ప్రభాతవార్త: మణిపాల్ గ్లోబల్ స్కిల్స్ అకాడమీ,భారతదేశం ప్రధాన నైపుణ్యశిక్షణ సంస్థ అని, నేషనల్ సేల్స్ అకాడమీని ప్రారంభించే కొత్త కార్యక్రమం పోర్ట్ఫోలియో క్రింద సేల్స్ ఉద్యోగాలలో ఉపాధి పొందగల నైపుణ్యం కలిగిన నిపుణులను తయారుచేయనుందని ప్రతినిధి ప్రసాద్ తెలిపారు. భారతదేశంలో లక్షకుపైగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని, ఈ కార్యక్రమం ద్వారా మణిపాల్ గ్లోబల్ స్కిల్స్ అకాడమీ విక్రయాలు, కస్టమర్ మేనేజ్‌మెంట్ బృందాలను బలోపేతం చేయడానికి చూస్తున్న భాగస్వామి బిఎఫ్ఎస్ఐ ,ఫార్మాస్యూటికల్,కన్జూమర్ ప్యాకేజ్డ్ గూడ్స్ కంపెనీల కోసం నిపుణులను నియమించుకుంటుంది

## నటుడు చలపతిరావుకు సంతాపం



తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్త: సినీ నటుడు చలపతిరావు గుండెపోటుతో మృతి చెందడం పట్ల సోమవారం తిరుపతిలో రాయలసీమ రంగస్థలి కళాసంస్థ నివాళులర్పించింది. రంగస్థలి కార్యాలయంలో చలపతిరావు చిత్రపటం ఉంచి గుండాల గోపీనాథరెడ్డి, కెఎన్ రాజు, అక్కినపల్లి మునికృష్ణ యాదవ్, కండ్రిగ ఉమ, సుబ్రమణ్యంయాదవ్, రాజశేఖర్‌రెడ్డి, కమలేష్‌రెడ్డి ,కుమార్‌రెడ్డి పాల్గొని నివాళులుర్పించారు.

## మహిళల వల్లే దేశ ప్రగతి సాధ్యం - శివశంకర్



రేణిగుంట, డిసెంబరు 26 ప్రభాతవార్త: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశ ప్రగతి సాధ్యమవుతుందని కరకంబాడి బ్రాంచి కెనరా బ్యాంకు మేనేజర్ శివశంకర్ అన్నారు. రేణిగుంట మండలం ఎల్లమండ్యం గ్రామం నందలి గీత ఆశ్రమంలో సోమవారం రాస్ ఆధ్వర్యంలో రాస్ మహిళా సంఘాలు శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణతో వైభవంగా శ్రీనివాసుల కల్యాణం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు మేనేజర్ శివశంకర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించడం అద్భుతంగా ఉందన్నారు. మహిళలు ఏదైనా సాధించగలరని చెప్పడానికి నిదర్శనమన్నారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అందుకు బ్యాంకులు సహకరిస్తాయన్నారు. శ్రీనివాస కల్యాణ మహోత్సవంలో రాస్ డైరెక్టర్ నాగరాజు, గీత ఆశ్రమం పవిత్రానంద స్వామి, రాస్ సిబ్బంది శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సునీత, రాణి, ఈశ్వరి, మహిళా సంఘాల నేతలు యశోదమ్మ, లక్ష్మి, అనురాధ, విజయమ్మ, 250 సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి విరాళం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది.ఈ నేపథ్యంలోచెన్నైకు చెందిన భక్తులు విరాళం అందించారు. సోమవారం చెన్నైకు చెందిన డాక్టర్ డి.వి.ఆర్ ప్రకాష్ కుటుంబసభ్యుతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారు విరాళం ఇవ్వాలని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుతో చర్చించారు. ఆయన సూచనలతో ప్రకాష్‌రావు రూ.50వేల విరాళాన్ని నిత్యాన్న ప్రసాదానికి అందించారు. వారికి ఆలయంలో ప్రత్యేక దర్శనం,ఏర్పాటు చేసారు. వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.నంద, భాస్కర్, పిఎం చంద్ర దేవస్తానం అధికారులు పాల్గొన్నారు.

## రోడ్లపైనీటినిల్వలు-జ్వరాలతో ప్రజలు



తొట్టంబేడు, డిసెంబర్ 26 ప్రభాతవార్త : మండలంలోని పొయ్య ఎస్సీ కాలనీలో నాలుగు వీధులు కూడలి వద్ద వర్షపునీరు నిలవడంతో దోమలు ప్రబలుతున్నాయి.దీంతో ఎస్సీ కాలనీ వాసులు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు దోమలు బెడదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు మరోవైపు సీజనల్‌వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇటీవల స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూదన్‌రెడ్డి గడపగడపకు పర్యటించిన సందర్భంగా సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. ప్రజలు జ్వరాలు ప్రబలక ముందే సంబంధిత కార్యదర్శులు స్పందించి చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది.

## ఎమ్మెల్యేచే విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



నారాయణవనం, డిసెంబర్ 26 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మంజూరు చేసిన ట్యాబ్‌లను సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా అందజేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో 8వ తరగతి చదువుతున్న 419 మంది విద్యార్థులకు ట్యాబులతో పాటు బైజ్యూస్ ఇన్స్టలేషన్‌తో కలిపి మొత్తం ఒక్కో విద్యార్థికి 32వేల రూపాయాల ఖర్చుతో వీటిని అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని సిఎం జగనన్న అమ్మఒడి లబ్దిదారుల అయిన 8వ తరగతి విద్యార్థులకు అందించడం గర్వించ దగ్గ విషయమన్నారు. పిల్లలు బాగా చదువుకుంటే ఆ కుటుంబం యొక్క స్థితి మారిపోవడం ఖాయమన్నారు. కావున తమ పిల్లలను పాఠశాలకు పంపి చదువును ఇచ్చే విధంగా తల్లితండ్రులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులందరికి ట్యాబ్‌లను అందించిన తర్వాత అరణ్యంకండ్రిగ పంచాయతీలో జరిగిన గడప గడప కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్షం కురుస్తున్న ఎమ్మెల్యే గడప గడప కార్యక్రమంకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శ న్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, కైలాసకోన ఛైర్మన్ ఇ సుబ్రమణ్యం యాదవ్, మాజీ కోన ఛైర్మర్ బత్తల భాస్కర్ యాదవ్, ఉప సర్పంచ్ మురళి, ఎంపిడిఓ గుణశేఖర్, తహశీల్దారు ప్రమీల, ఎంఇఓ భారతి, హెడ్‌మాస్టర్లు ఆనందబాబు, ధనంజయులునాయుడు, మనోహరి, శశికళ, పంచాయతీ కార్యదర్శులు వి ప్రభురావు, సుజన, భారతి, కిషోర్, అనిల్, లీలాకుమారి, కిరణ్, పాఠశాల కమిటీ అధ్యక్షులు శరవణ, చీరాలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందకుంటే అధికారులు ఇంటికే

ఎంఎల్ఏ బియ్యపు మధుసూదనరెడ్డి



శ్రీకాళహస్తి రూరల్,డిసెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అర్హత ఉండి ఏ ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందలేదంటే అధికారులను ఇంటికి పంపుతామని శాసన సభ్యుడు బియ్యపు మధు సూదనరెడ్డి అన్నారు. సోమవారం బోరున వర్షం కురుస్తున్నా ఖాతరు చేయక శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగ గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. రాష్ట్రంలో జగనన్న రాజ్యంతోనే సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమౌతుందని శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి అన్నారు. ఆయన శ్రీకాళహస్తి మండలంలోని పుల్లారెడ్డి కండ్రిగలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం ప్రకటించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆయనకు వైకాపా నాయకుడు చెవిరెడ్డి మధదుసూధనరెడ్డి సారథ్యంలో సర్పంచ్ శుభరత్న, ఎంపిటిసి శాంతి భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసారు. ఇంటింటి వద్ద మహిళలు హారతులిస్తూ స్వాగతం పలికారు. ప్రజలు పూల వర్షంతో ముంచెత్తారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని దీర్ఘకాలం తెలుగుదేశం పార్టీ ఒకే కుటుంబం పరిపాలించింది. శ్రీకాళహస్తి మండలం అభివృద్ధి గురించి పట్టించుకున్నారా? అని ప్రశిస్తూ ముందుకు సాగారు. జగనన్న పాలనలో వేలాది మందికి పక్కా గృహాలు, సంక్షేమ పథకాలతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కోసం పరిశ్రమలు, విద్యా సంస్థలు, విమానాశ్రయం అభివృద్ధి, కేంద్ర విద్యాసంస్థలు వచ్చాయన్నారు. పరిశ్రమల స్థాపనతో మండలం లోని వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించారని జనానికి వివరిస్తున్నారు. వికృతమాల సమీపంలో విమానాశ్రయం వద్ద ఏర్పాటుచేసిన డిక్సన్ పరిశ్రమతో నేడు ఎందరు నిరుద్యోగులు జీవనోపాధి కల్గి ఉన్నారని ప్రశ్నించారు. మీ సమస్యలుంటే నా దృష్టికి తీసుకురమ్మని ఎంఎల్ఏ పిలుపు నిస్తూ తన మొబైల్ నెంబర్‌ను అందిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి మాయ గాళ్ళు వస్తారు. మభ్యపెడతారు. ఎన్నికలు ముగిసిన తరువాత హైదరాబాదుకు బయలుదేరుతారు. ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటే నాయకుడు కావాలా? చుట్టపుచూపుగా వచ్చే నాయకులు కావాలో తెల్చుకోవాల్సిన ఎన్నికలు త్వరలో రాబోతున్నాయని చైతన్య పరుస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఏతో పాటు రవీంద్రరెడ్డి, మునిరాఘవరెడ్డి, నాగమోహన్‌రెడ్డి, శివమోహన్‌రెడ్డి, శివప్రసాద్, కృష్ణమ్మ, ఈశ్వరరెడ్డి, యుగంధర్‌రెడ్డి, చిట్టి ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## జీసస్ మార్గాలే ప్రజలకు శరణ్యం : ఎంపీపీ

కేవీబీ పురం, డిసెంబరు 26 ప్రభాతవార్త: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని వగతురు గిరిజన కాలనీలో ఉన్న చర్చిలో పాస్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి నందకుమార్‌తో పాటు నాయకులు హాజరయ్యారు. అదే విధంగా ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన మండల ట్రైనర్ కల్పన తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని ప్రేమ్‌కుమార్ ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ జీసస్ జన్మదిన సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం అందులోను గిరిజనులకు దుస్తులు పంపిణీ, అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీసీసెల్ అధ్యక్షుడు హరిబాబురెడ్డి, వర్మ, ఎస్సీసెల్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ డేవిడ్, గిరిజనులు పాల్గొన్నారు.

## నగరిలో 98వ సీపీఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

నగరి, డిసెంబరు 26 ప్రభాతవార్త: నగరిలో సీపీఐ పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవాన్ని నగరి సీపీఐ కార్యదర్శి కోదండయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండయ్య మాట్లాడుతూ భారతదేశంలో ప్రజల సామాజిక ఆర్థిక రాజకీయ హక్కుల కోసం పోరాటం చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనన్నారు. 1925 సంవత్సరం డిసెంబరు 26న మొట్ట మొదటి సారి భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేశారు. 1917లో జరిగిన రష్యాలో సోవియట్ విప్లవం లెనిన్ నాయకత్వంలో విజయం సాధించిన తరువాత భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలో ఉన్న కమ్యూనిస్టులు కార్మిక హక్కుల కాని, ఉద్యోగ భద్రత కాని, దేశ సంపదను పెంచడంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడడంలో ప్రపంచాన్ని ఆకర్షించిన తెలంగాణ రైతాంగ పోరాటాన్ని సాధించింది. నిరంతరం పేద ప్రజల సమస్యల పై కార్మికుల హక్కులను చట్టాలను సాధించడంలో కీలక పాత్ర కమ్యూనిస్టులదేనన్నారు. ఎన్నో సమస్యల పోరాటాలు చేసి పేదలకు అండగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీలను బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత భారతదేశంలో ఉన్న పేద, మధ్య తరగతి కార్మిక ఉద్యోగస్తులు అందరి బాధ్యత, కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలబడి భవిష్యత్ కొత్త ఉద్యోగాలు సాధించుకోవడానికి, ఉన్న ఉద్యోగాల కాపాడుకోవడానికి, కార్మిక హక్కులను కాపాడుకుని, భారతదేశ ఆర్థిక మూల స్తంభాలైన ప్రభుత్వ సంస్థలను బ్యాంకింగ్ రైల్వే, ఎల్ఐసీ సంస్థలను తెగ నమ్ముతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గట్టేదించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొత్త ఉద్యోగాలు ఇప్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వైసీపీ ప్రభుత్వం వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నాగరాజు, హరి, సీపీఐ పార్టీ పట్టణ నాయకులు వేలన్ బాషా, శేఖర్, మురళి, ఏఐటీయూసీ నాయకులు ప్రకాష్, కన్నప్ప, అయ్యప్ప, శివ, అప్పన్, శేఖర్, హరి, నాగరాజు, ప్రభాకర్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం వస్తేనే రాష్ట్రం బాగుపడుతుంది : గాలి భానుప్రకాష్

నగరి, డిసెంబరు 26 ప్రభాతవార్త: వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో సర్వనాశం అయిన ఆంధ్రప్రదేశ్‌ను బాగుపరచాలంటే తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అవుతుందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం నగరి రూరల్ మండలం కృష్ణారామాపురం పంచాయతీలో వైసీపీ పాలనలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడైన రోడ్లు, వీధి దీపాలు మరమ్మతులు చేసే పరిస్థితి లేదని, యువతకు ఉద్యోగాలు లేక రోడ్డున పడుతున్నారు. పేద ప్రజల పింఛన్లు తొలగించి అన్యాయం చేస్తున్నారని తెలిపారు. పన్నుల భారం మోపుతూ చివరికి చెత్త మీద పన్ను వేసిన చెత్త ప్రభుత్వం వైసీపీ అని విమర్శించారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని బాగు చేయాలంటే సైకిల్ పాలన రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగరి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ సెక్రటరీ బాలాజీ, జవహర్‌రెడ్డి, ఏఘుమలైరెడ్డి, బాల సురేష్, తెలుగు రైతు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఉదయకుమార్‌రెడ్డి, పయణి, రోసిరెడ్డి, మునస్వామి, గోవిందరెడ్డి, అశోక్, వేణు, మధు, నారాయణస్వామి, మణిలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా.. ఆర్థిక సాయం అందజేసిన మంత్రి రోజా

నగరి, డిసెంబరు 26 ప్రభాతవార్త: నగరి మున్సిపాలిటీకి చెందిన మహిళ ఎం.ఎం.కామాక్షి ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి కింద రూ.3లక్షల 50 వేలు, నగరి మండలం చిన్నతాంగల్‌కు చెందిన వాసుగి ధనపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.3 లక్షల రూపాయల చెక్కును సోమవారం అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరు చేయించిన మంత్రి రోజాకి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మోటార్లకు మీటర్లు రైతులకు ఉరితాళ్లు

**- రైతు అధికార ప్రతినిధి ధనంజయనాయుడు**



వడమాలపేట, డిసెంబరు 26 ప్రభాత వార్త: అధికార దిక్కారంతో మోటార్లకు మీటర్లు పెడుతూ రైతులకు వైసీపీ ప్రభుత్వం ఉరితాళ్లు బిగిస్తూ రైతులను దాఘా చేస్తున్నదని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికారప్రతినిధి ధనంజ నాయుడు విమర్శించారు. సోమవారం తిరుపతిలోరైతుల వ్యవసాయ మోటార్ల మీటర్లకు ఏర్పాటుపై నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతుల కోసం ఉచిత విద్యుత్ ప్రకటిస్తే, జగన్మోహన్‌రెడ్డి దానిని తుంగల్లో తొక్కి కేంద్ర ప్రభుత్వంకఉ దాసోహమై మోటార్లకు మీటర్లను అమర్చాడానికి జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రైతాంగానికి టీడీపీ పార్టీతోనే న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు, రైతు అధ్యక్షులు మునిరెడ్డి, దాముయాదవ్, వెంకటేశ్వరరావు, ఉమాపతి, శివరాయల్, బాబురెడ్డి, శివరాజు, పెద్దబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల మెడలకు ఉరితాళ్ళు బిగించవద్దు: తెలుగుదేశం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త : రైతుల మోటార్లకు మీటర్లు,రైతుల మెడలకు ఉరితాళ్ళు బిగిస్తున్నారని తెలుగుదేశం పార్టీ ధ్వజమెత్తింది. సోమవారం తెలుగుదేశం నాయకులు విద్యుత్ ఎస్ఇకి వినతి పత్రం అందించి నిరసన తెలిపినట్లు తెలిపారు. బిజెపి పాలిత రాష్ట్రాలు కానీ తెలంగాణాలో కాని లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతుల మోటార్లకు మీటర్లు బిగించి వ్యవసాయాన్ని మరింత భారం చేస్తున్నారని వివరించారు.తెలుగుదేశం హయాంలో రైతులు, దళిత,గిరిజనులకు ఉచిత విద్యుత్ ఇచ్చి ప్రోత్సహిస్తే ప్రస్తుత ప్రభుత్వం ఒక్క చాన్సు అని గద్దెనెక్కి అన్ని వర్గాలను మోసం చేస్తుందని ధ్వజమెత్తారు.ఈ కార్యక్రమాల్లో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహాయాదదవ్,రైతు అధ్యక్షులు రావూరి రాధాకృష్ణనాయుడు, తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, పి.మనోహర్ నాయుడు, ఇ.శివకోటేశ్వరరెడ్డి, కె.గోపినాథ్‌రెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, ఎం.జనార్ధన్‌రెడ్డి, కె.గోపినాథ్‌రెడ్డి, టి.ప్రకాష్‌రావు,పి.వెంకటరత్నం, పి,చిన్నారెడ్డి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు టి.జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్‌పై టాస్క్‌ఫోర్స్ కమిటీ అత్యవసర సమావేశం



తొట్టంబేడు, డిసెంబర్ 26 ప్రభాతవార్త : కోవిడ్‌పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తొట్టంబేడు, కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, విద్యాశాఖ నుంచి సిఆర్‌పి మునికృష్ణారెడ్డి, పోలీసు సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. తహశీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ కోవిడ్ కొత్తవేరియంట్ ఒమిక్రాన్-బిఎఫ్7గా వస్తోందన్నారు. గ్రామాల్లో వాలంటీర్లు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా విదేశాల నుంచి, ఇతర ప్రాంతాలనుంచి వచ్చిన వ్యక్తులను గుర్తించి వెంటనే తమకు సమాచారాన్ని అందించాల న్నారు. ఎవరికైనా జలుబు,జ్వరం, దగ్గు ఉంటే కోవిడ్ పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. గ్రామాల్లో ఆశావర్కర్లు, వాలంటీర్లు ఫీవర్ సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు కూడా ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రతి ఒక్కరు మాస్కులు ధరించడంతో పాటు, శానిటైజర్ వాడకం, సామాజిక దూరాన్ని పాటించేలా ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్నారు. వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ రెండు ఆరోగ్య కేంద్రాలకు 200చొప్పున కోవిడ్‌ర్యాపిడ్ కిట్లను ప్రభుత్వం పంపిణీచేసిందని ప్రతి సచివాలయంలో 10చొప్పున అందుబాటులో ఉంటాయని ఇక్కడ ఎఎన్ఎంలు పరీక్షలు చేస్తారన్నారు. అయితే ఇంటి నుంచి బయటకు వెళ్ళినపుడు తిరిగి ఇంటికి వచ్చినపుడు కాళ్ళు, చేతులను పరిశుభ్రంగా సబ్బుతో శుభ్రం చేసుకోవాలని కోరారు. గత రెండు వేరియంట్లతో పోల్చితే భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని అయితే జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

## ఫించన్లు తొలగించి పేదల కడుపు కొట్టొద్దు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : రాష్ట్రంలోవైసిపి ప్రభుత్వం లేనిపోని నిబంధనలతో లక్షలాది మందికి పెన్షన్లును తొలగిస్తుందని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరుచక్రధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం వేల వైసిపి సర్కారు ఫించనుదారుల నెత్తిన పిడుగు వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సాకులు చూపుతూ ఒక్క తిరుపతి జిల్లాలోనే 9,198మందికి ఫించనుకు అనర్హులంటూ నోటీసులు జారీచేసిందని, రాష్ట్ర వ్యాప్తంగా 1.90లక్షల మంది అనర్హుల జాబితాలో చేరారన్నారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని 1,118 మందికి అనర్హులంటూ నోటీసులు జారీచేశారు. నోటీసులు అందుకున్న ఫించనుదారులు ఆందోళనలో ఉన్నారని దీంతో ఫించన్లపై ఆధారపడి జీవించే వృద్ధులు, పేద మరమగ్గ కార్మికులు వీధిన పడ్డారన్నారు. ఓవక్క విద్యుత్ బిల్లులు పెంచి మరోపక్క పింఛన్లు తొలగించడం దారుణమని వ్యాఖ్యానించారు. వెంటనే తొలగించిన ఫించన్లను పునరుద్ధరించాలని లేని పక్షంలో ఫించన్లు కోల్పోయిన ప్రతి ఒక్కరి తరపున పోరాడుతామని హెచ్చరించారు. ఫించనుదారులకు అండగా జనసేన ఉంటుందని తెలిపారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



తొట్టంబేడు, డిసెంబర్ 26 ప్రభాతవార్త : మండలంలోని లింగమనాయుడుపల్లికి చెందిన ఎస్‌కె. మీర్జావలి, పెద్దసింగమాల హరిజనవాడకు చెందిన ఎస్.వెంకట్రామయ్య, రెడ్డిపల్లికి చెందిన రంగనాయ కులు అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో విషయం తెలుసుకున్న ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించడానికి తన కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ద్వారా దహన సంస్కారాలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.30వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే మృతుల కుటుంబాలకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## గడపగడపకు వైసిపి వైఫల్యాలు...ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి

**టిడిపి మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు**



చంద్రగిరి, డిశంబర్ 26 ప్రభాతవార్త: గడప గడపకు వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు అన్నారు. మండల పరిధిలోని శేషాపురంలో సోమవారం ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు మొదలుకుని పల్లె, పట్టణం వ్యత్యాసం లేకుండా పన్నులతో పోటెత్తిస్తున్న ప్రభుత్వం ఇదేనంటూ దుయ్యబట్టారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షన్‌దారులకు జీతాలు చెల్లించలేని దుస్థిలో ప్రభుత్వం వుందంటూ దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి తగిన బుద్దిచెప్పాలనీ, తెలుగుదేశం పార్టీని ఆధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాశం చంద్రకుమార్ నాయుడు, నిరంజన్ నాయుడు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొందూరు ప్రవీణ్ రాయల్, గిరి నాయుడు, నారా సుబ్రమణ్యం నాయుడు, మురళి నాయుడు, మూర్తి, ఒకాలయ్య, గంగాధరం, వెంకటయ్య, నాయుడమ్మ, టిడిపి మహిళావిభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు లంకెళ్ళ లలిత, వీరంగారి రమేష్ రెడ్డి, కన్నయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సిపిఐ పార్టీ 98వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాలగురవయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం కార్మికవర్గ హక్కులకోసం అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఐ పార్టీదే అన్నారు. ఈ నియోజకవర్గంలో అనేక భూపోరాటాలు నిర్వహించి సాగుభూములు, ఇంటి స్థలాలు పంచిన ఘనత సిపిఐ పార్టీకే దక్కిందన్నారు. అందుకే నేడు పేద, మద్యతరగతి, కార్మికవర్గ ప్రజలు సిపిఐ పార్టీని ఆదరిస్తున్నారన్నారు. రేణిగుంట మండలంలో జిల్లా కార్యదర్శి మురళీ, ఏర్పేడు మండలంలో మల్లి, రమేష్, శ్రీకాళహస్తి మండలంలో శివకుమార్, పట్టణంలో కార్యదర్శి గోపి, తొట్టంబేడులో శ్రీనివాసులు, సివిల్ సప్లయిస్ జిల్లా కార్యదర్శి అయ్యప్ప ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరణలు జరిగాయి. కార్యక్రమాల్లో ప్రజానాట్యమండలి నియోజకవర్గం కార్యదర్శి జనమాల గురవయ్య, యువజన సంఘ నాయకులు ధన, నవీన్, మునిరాజ, కార్మికులు మురళీ, మహిళా సంఘ నాయకురాళ్ళు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయంగా మారిన 16వ ఓజిలి జాతీయ రహదారి



ఓజిలి, డిసెంబర్ 26, ప్రభాతవార్త : ఓజిలి 16వ జాతీయ రహదారిలో ఏం జరుగుతుంది? ఇక్కడ ఏదైనా శక్తి ఉందా? హైవేలో ఆదమరిస్తే జీవితాలు అంతే.. ఆ జాతీయ రహదారిపై తన వాహనాలను రైమనిపించే వాహన చోదకులు ఒక్కడ మాత్రం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎందుకంటే రోడ్డు పక్కనే హోటల్లు, పెట్రోల్ బంకులల వద్ద నిర్లక్ష్యంగా నిలిపివేసే వాహనాలు కొన్నిసార్లు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. సంఘటనలు జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ఆ తర్వాత పెద్దగా పట్టించు కోకపోవడంతో మళ్లీ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఓజిలి రాజపాలెం, రాచపాలెం నుంచి పండ్లూ రు క్రాస్ వరకు సుమారు 2 కిలో మీటర్ల పొడవు ఉన్న జాతీయ రహదారి పరిస్థితి పై పక్కనే హోటల్లు, పెట్రోల్ బంకులు ఉండడంతో వాహనాలను కొందరు హైవే పైనే నిర్లక్ష్యంగా నిలిపి వేస్తారు. చీకట్లో ఈ వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రహదారి వెంబడి లారీలకు సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా లేదా రోడ్డుపైనే వాహ నాలు నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజపాలెం నుంచి పండ్లూరు 2 కిలో మీటర్ల వ్య వధిలో ఉన్న ఈ జాతీయ రహదారిపై అనేక ప్రమాదాలు జరిగాయి. హైవే పై ప్రధానంగా రాజుపాలెం, ఓజిలి పెద్ద పరియ క్రాస్ రోడ్, రాచపాలెం క్రాస్ రోడ్, పండ్లూరు క్రాస్ రోడ్, ఈ రోడ్డులో డేంజర్ ఏరియాగా గుర్తించారు. అనేక మంది తీవ్ర గాయాల పాలైన వారు ఉండగా కొందరు వరకు మరణించిన వారున్నారు. జాతీయ రహదారి సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న నడకదారిని ఆక్రమించి వ్యాపారులు వ్యాపారం చేసుకోవడం, ఇతర వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల పాదచారులు ప్రధాన రహదారిపై వెళ్తుండగా ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన వారు ఎంతో మంది ఉన్నారు. రాజుపాలెం జాతీయ రహదారి నుంచి పండ్లూరు జంక్షన్ వరకు లైటింగ్ లేకపోవడంతో రాత్రివేళ రహదారి చీకటి మయంగా ఉండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక పక్క లైటింగ్ లేకపోవడం మరొక పక్క లారీల పార్కింగ్‌తో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు, జాతీయ రహదారి కావడంతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. రాత్రి పూట విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతుంది. చీకటి పడిన తర్వాత రహదారిపై అంధకారం అలుముకుంటుందని, ప్రాణాలను సైతం అరి చేతిలో పెట్టుకొని భయంగా ప్రయాణిస్తున్నామని వాహనదారులు అంటున్నారు. హైవే పై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలతో అధికారులు సరిపెడుతున్నారని, ఆచరణ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా ఒకెత్తు అయితే అసలు ఈ రెండు కిలో మీటర్ల వ్యవధిలో ఏం జరుగుతుందోనని ఏదైనా శక్తి ఉందా అని కొందరు అనుమానిస్తున్నారు. తక్షణమే ప్రజా శ్రేయస్సుకై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఫిర్యాదులపై సచివాలయ సిబ్బంది నివేదిక ఇవ్వాలి

**మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ**



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త : ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై ఏ విధంగా పరిష్కరించారనే విషయాలపై సంబంధిత సచివాలయ సిబ్బంది నివేదికలు ఇవ్వాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలిలు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, ఫిర్యాదులను స్వీకరించే స్పందన కార్యక్రమం నిర్వహించారు. అదే సమయంలో నగరంలోని అన్ని సచివాలయాల నుండి అడ్మిన్లు జామ్ మీటింగ్ ద్వారా తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయ ంలో జరిగిన స్పందనలో పాల్గొన్నారు. మొదటి కమిషనర్ అనుపమ అంజలి సచివాలయం వారిగా పరిశీలించి, హాజరు కాని వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతి సోమవారం సంబంధిత సచివాలయాల్లో సిబ్బంది మొత్తం ప్రజలకు అందుబాటులో ఉండాలని, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించేలా వుండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి ఫిర్యాదులను స్వీకరించారు. తిరుపతి సప్తగిరి నగర్‌లో గుంతలు పూడ్చి రోడ్డు వేయాలని, అక్కారంపల్లె మెయిన్ రోడ్డులో సెట్ బ్యాక్, పార్కింగ్ వదలకుండా హాస్పిటల్ నిర్మాణం చేపడుతున్నారని, శ్రీ నగర్ పిస్ట్ క్రాస్‌లో పందుల బెడద వున్నదని, ఉపాధ్యాయ నగర్‌లో రోడ్లు వేయమని, ఎం. కొత్తపల్లి లే అవుట్‌లో తమకు కేటాయించిన స్థలం కొండప్రాంతమని, మరో చోట కేటాయించాలని, కొన్ని ప్రాంతాల్లో కాలువలు క్లీన్ చేయాలనే ఫిర్యాదులపై స్పందిస్తూ పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పిస్తూ అర్హుల పెన్షన్లు తొలగిస్తున్నారని పిర్యాదు చేయగా, క్షున్నంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత ఫిర్యాదులపై నగర పాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది పరిశీలించి తగు పరిష్కారాలు చేస్తామని మేయర్ డా.శిరీష, కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిసనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, ఆర్ఓ సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డా. హరికృష్ణ, మేనేజర్ చిట్టిబాబు, ఫైర్ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి. రవి, మెప్మా వెంకటరమణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేటి తరం యువతకు సరికొత్త బజాజ్ పల్సర్ పి-150 ఎంతో అవసరం

**- డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి**




తిరుపతి నగరం, డిసెంబరు 26 ప్రభాతవార్త : నేటి తరం యువతకు సరికొత్త మోడల్ బజాజ్ పల్సర్ పి-150 ఎంతో అవసరమని డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని శ్రీరామ్ ఎంటర్‌ప్రైజెస్ షోరూంలో సోమవారం మెరుగైన ఫీచర్లతో పూర్తి సరికొత్తగా తీర్చిదిద్దిన నూతన పల్సర్ పి-150 టూవీలర్ స్కూటర్‌ను భూమన అభినయ్‌రెడ్డి ప్రారంభించి మార్కెట్‌లోకి విడుదల చేశారు. నేటి తరానికి ఈ స్కూటర్ ఎంతో అవసరమన్నారు. షోరూం స్థాపించిన నాటి నుంచి నేటి వరకు మా కుటుంబంతోశ్రీరాజ్ ఎంటర్ ప్రైజెస్ యాజమాన్యానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. అనంతరం షోరూం మేనేజింగ్ డైరెక్టర్ రాజా శ్రీనివాసరావు,చేతక్ ఎండీ అంజన, డీలర్ ఆర్.షాకేత్ రామ్ మాట్లాడుతూ బజాజ్ పల్సర్ పి-150 స్కూటర్‌లో ఓ ప్రత్యేకత ఉందన్నారు. ఎక్కువ మైలేజీ, కారుతో సమానంగా ఎల్ఈడీ బల్బుల సెటింగ్, సైలంట్ సైలన్సర్ బజాజ్ స్కూటర్ల మోడల్స్‌పై పది కిలోల బరువు తక్కువతో శక్తివంతమైన గ్రిప్ ట్యూబ్‌లెస్ టైర్లతో ఐదు కలర్స్‌తో యువతను ఆకర్షించే విధంగా ఉందని తెలిపారు. గత 33 సంవత్సరాలుగా బజాజ్ వాహనాలతో తమకు అనుబంధంగా ఉందని బజాజ్ పల్సర్ పి-150 స్కూటర్ గొప్పతనాన్ని వివరించారు. కస్టమర్లు, ఉమ్మడి జిల్లాలప్రజలు ప్రధానంగా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది, వెంకటముని,కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్వామివారి సేవలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్



శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం రాష్ట్ర దేవాంగ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బీరక సురేంద్రబాబు కుటుంబసభ్యులతో విచ్చేశారు. వీరికి ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు ఆలయ దక్షిణగోపురం వద్ద స్వాగతం పలికారు. ఆలయంలో స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనంతో పాటు పూజలు చేయించుకున్నారు. అనంతరం వీరికి గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామివారి శేషవస్త్రాలతో పాటు స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షులు పులిరామచంద్ర, సెన్నీరుకుప్పంశేఖర్, మొగరాలగణేష్, నంద, భాస్కర్, పి.ఎం.చంద్ర, శశిధర్, ఆలయాధికారులు, బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

# లబ్దిదారులకు ద్వై-వార్షిక నవరత్నాల పథకాలు

**- జిల్లాలో కొత్తగా 18.243 మందికి సుమారు రూ.22.78 కోట్లు లబ్ది - కలెక్టర్ వెంకట రమణారెడ్డి**



తిరుపతిరూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు - నవరత్నాలు క్రింద 2022-23 ఆర్థిక సంవత్సరములో సంక్షేమ క్యాలెండర్ మేరకు లబ్దిదారులకు ద్వై-వార్షిక నవ రత్నాలు జిల్లాలో 18.243 మందికి సుమారు 22.78 కోట్ల రుపాయాలు లబ్ది చేకూరనున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. వైయస్సార్ ఇ.బి.సి. నేస్తం, చేయూత, జగనన్న చేదోడు, అమ్మఒడి, వైయస్సార్ మత్స్యకార భరోసా, కాపు నేస్తం, వాహన మిత్ర, నేతన్న నేస్తం, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి అంశాలపై మంగళవారం 11గంటలకు ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసు నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో, ప్రజాప్రతినిధులతో, లబ్దిదారులతో సమావేశమై లాంచింగ్ చేస్తారని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

# జనవరి 6న శివయ్యకు వేడి నీళ్ళ అభిషేకం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే సేవలకు ఎంతో విశిష్టత చోటు చేసుకుంది. ఇతర ఆలయాల కన్నా భిన్నంగా ఇక్కడి ఆలయంలో పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే ఉత్సవాల్లో అంతటి ప్రాధాన్యత కల్గిన ఉత్సవం 'ఆరుద్ర'. ఆ రోజు స్వామి వారికి వేడినీళ్ళతో అభిషేకం నిర్వహించటం ఆనవాయితి. ఏడాదిలో ఒకే ఒక రోజు వేడినీళ్ళతో అభిషేకం నిర్వహించటం ప్రత్యేకం.ఈ కార్యక్రమం ఈ ఏడాది శనివారం వస్తుంది..ఆరుద్ర సందర్భంగా ఆలయ వేళలను మార్పు చేస్తున్నట్లు వివరించారు. ఉదయం 3గంటలకు పురవీధుల్లో జేగంట, 3.30గంటలకు మంగళవాయిద్యాలు, 3.45 గంటలకు తిరుమంజనం, 4 గంటలకు గోపూజ, పళ్ళియార పూజ, తేవారం, 4.30గంటలకు ప్రథమ కాలాభిషేకం (సేవలకు అవకాశం లేదు), 6గంటలకు లింగోద్భవ కాలభిషేకం (స్వామి వారికి మాత్రమే), ఉద్దిపిండి లింగ దర్శనం, 7గంటలకు నటరాజస్వామి అభిషేకం, ఉత్సవం, 7.30గంటలకు పరివార దేవతా నైవేద్యం, 9గంటలకు గొబ్బి ఉత్సవం, శ్రీజ్ఞాన ప్రసూనాంబ సేవత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిని అలంకరణ చేసి అమ్మవారికి సన్నిధికి ఎదురుగా ఊంజల్‌సేవ, 10గంటలకు ద్వితీయ కాలాభిషేకం ఉష్ణోదయ అభిషేకం మధ్యాహ్నం 2గంటలకు ఉచ్చికాలాభిషేకం, సాయంత్రం 5 గంటలకు ప్రదోషకాలాభిషేకం, రాత్రి 8గంటలకు ఆరికట్లోత్సవం, 9.30గంటలకు ఆలయం మూత. ఆ రోజు ఏకాంత సేవ లేదని ఆలయాధికారులు తెలిపారు.

# ఎబివిపి రాష్ట్ర కార్యదర్శిగా యాచేంద్ర



శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : అఖిల భారతీయ విద్యార్ధి పరిషత్ రాష్ట్ర 41వ మహాసభలు ఈనెల 23నుంచి 25వ తేదీల్లో కర్నూలులో నిర్వహించారు. ఇందులో రాబోవు నూతన సంవత్సరానికి రాష్ట్ర అధ్యక్ష్య, కార్యదర్శులును ఎన్నుకున్నారు. నూతన ఏబివిపి రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన సూళ్ళూరుయాచేంద్ర ఎన్నికయ్యారు. ఈసందర్భంగా యాచేంద్ర జెఎన్‌టియు అనంతపురం యూనివర్సిటీలో ఏబివిపి అధ్యక్షుడుగా, అనంతపురం జిల్లా టెన్నికల్ సెల్ కన్వీనర్‌గా, రాష్ట్ర టెక్నికల్ సెల్ కన్వీనర్‌గా మరియు రాష్ట్ర టెక్నికల్ సెల్ ప్రముఖ్‌గా అనేక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం యాచేంద్ర అనంతపురంలోని జెఎన్‌టియులో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలోపరిశోధన విద్యను అభ్యసిస్తున్నాడు. అనంతరం యాచేంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా తనకు అవకాశం ఇచ్చిన రాష్ట్రంలోని విద్యార్ధి పరిషత్ కార్యకర్తలకు మరియు రాష్ట్ర శాఖ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# టిటిడి విద్యాసంస్థల..విద్యార్ధులకు ప్రభుత్వ ట్యాబ్‌లు

తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్త: ప్రభుత్వం పంపిణీ చేసిన 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ సోమవారం తిరుపతిలో టిటిడి ఎస్వీ ఉన్నతపాఠశాల విద్యార్థులకు చేరాయి .. ఈ ట్యాబ్‌లను టిటిడి డిఇఓ భాస్కర్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. సాంకేతికను వినియోగించుకుని మెరుగైన విద్యనభ్యసించాలని కోరారు.

# స్పందన ఫిర్యాదులను పరిష్కరించి...బాధితులకు సకాలంలో న్యాయం



తిరుపతి క్రైం, డిసెంబర్ 26 ప్రభాతవార్త : స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పి కులశేఖర్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పి కార్యాలయానికి జిల్లా వ్యాప్తంగా 45 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ సమస్యలను విన్నవించు కున్నారు. అడిషనల్ ఎస్పి ప్రజల సమస్యలను సానుకూలంగా విని స్పందించి ప్రతి ఒక్కరి కేసు విషయాలు తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి తెలిపారు.

# సైనికుల సంక్షేమం కోసం మహిళా సంఘాలు రూ.3.50 లక్షలు విరాళం

చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త: దేశ రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న సైనికుల సంక్షేమం కోసం జిల్లాలోని మహిళా సంఘాలు 3.50 లక్షల రూపాయల విరాళంను సోమవారం ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశాయి. డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ మహిళా సంఘాల 3.50 లక్షల రూపాయల చెక్కును ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, డిఆర్ఓ రాజశేఖర్, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వంగవీటి రంగా విగ్రహం ఏర్పాటు చేస్తాం! : ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. సోమవారం మోహన్‌రంగా 34వ వర్ధంతిని పట్టణంలోని పెండ్లి మండపం వద్ద శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మ కర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు శాసనసభ్యుడు మధుసూదనరెడ్డి ముఖ్యఅతిధిగా విచ్చేసారు. శ్రీకాళహస్తి నియోజక వర్గంలో తనకు కాపు నాయకులు, యువత అందిస్తున్న సేవలు అనిర్వచనీయం అన్నారు. తన గెలుపుకు ఎంతో సహకరించిన వారి సంఘానికి స్థలం కేటాయించామన్నారు. భవన నిర్మాణానికి సహకరిస్తామని వివరించారు. వంగవీటి రంగా సేవలకు గుర్తింపుగా పట్టణంలోని కూడలిలో వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని శాసనసభ్యుడు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన బలిజ సోదరులతో కలసి రంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తరువాత వేలాది మందికి భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమాల్లో అంజూరు తారక శ్రీనివాసులు పట్టణ వైకాపా అధ్యక్షుడు పగడాల రాజు,పూల కృష్ణయ్య,ఉప్పు కృష్ణయ్య, మున్నారాయల్, జయశ్యాం,సూరాగారి రమేష్, ఉత్తరాజి శరవణ,కంఠా ఉదయ్, శేఖర్, గణేష్,పూడి రవి,చింతామణిపాండు, ముత్యాల వెంకటకృష్ణ, కోలా వెంకటేశ్వరరావు,తీగల హరి,తీగల భాను,జలకం కిషోర్,తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

**- వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్**

చిత్తూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త: జిల్లాలో జనవరి నెలాఖరులోపు 8 వేల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి సోమవారం ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్ ఎంపిడిఓలు, హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జీ కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 17,497 ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందని, అలాగే జనవరి 20వ తేదీలోపు మరో 8 వేల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయ్యేలా పక్కా ప్రణాళిక రచించి అమలు చేయాలని అధికారులకు ఇన్‌ఛార్జీ కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం బిబిఎల్ స్థాయిలో వున్న ఇళ్ళ నిర్మాణాలను కచ్చితంగా స్టేజ్ కన్వర్షన్ చేసేలా పక్కా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే లేఅవుట్లలో నిర్మాణాల్లో వున్న ఇళ్ళను సత్వరం వేగవంతం చేసేలా ప్రణాళికలు రచించి అమలు చేయాలన్నారు. లేఅవుట్లలో మౌళిక సౌకర్యాలు ఎమైనా కల్పించాల్సి వుంటే వాటిని త్వరగా చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణాలు చివరి దశలో వున్న సమయంలో లబ్దిదారులు ఆర్థికంగా ఇబ్బంది కలుగకుండా వారికి స్వయం సహాయక సంఘాల నుండి రుణాలు సత్వరం మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ళ నిర్మాణాల కోసం మంజూరు చేసిన నిధులు సద్వినియోగం అయ్యాయా! లేదా! అనే విషయాలను శాఖల అధికారులు పరిశీలించాలన్నారు. గత వారం లక్ష్యాలు పూర్తి చేయని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను అందుకు గల కారణాలను ఇన్‌ఛార్జీ కలెక్టర్ వారిని అడిగి తెలుసుకొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పిడి పద్మనాభం, ఇఇలు, డిఇలు పాల్గొన్నారు.

# వరసిద్ధుని సేవలో ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్



కాణిపాకం, డిసెంబర్ 26 ప్రభాతవార్త: ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, చిత్తూరు వన్ డిపో మేనేజర్ కృష్ణమూర్తి, సీఐ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

# క్యాలండర్‌లు ఆవిష్కరించిన మంత్రి పెద్దిరెడ్డి



సదుం,డిసెంబరు 26 ప్రభాతవార్త : మండల పరిదిలోని యర్రాతివారిపల్లె అయ్యప్ప స్వామి వారి ఆలయంలో సోమవారం రాష్ట్ర విద్యుత్ అటవీ పర్యావరణ భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి బోయకొండ గంగమ్మ ఆలయ క్యాలండర్‌లను ఆవిష్కరించారు. ఈక్యాలండర్‌లను జిల్లా ప్రింటింగ్ ప్రెస్అధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి ముద్రించి ఇచ్చారు. అదే విధంగా ప్రతి సంవత్సరం మాఘ మాసంలో ఆలయంలో జరిగే లక్ష కుంకుమార్చన గోడ పత్రికలను, రసీదు పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి,ఆలయ ఛైర్మెన్ మిద్దింటి శంకరనారాయణ,ఈఓ చంద్రమౌళి, పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సత్కారం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 26 ప్రభాతవార్త : జాతీయ వినియోగదారులు హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తొట్టంబేడు మండల యువనేత కవల గుంట భరత్‌రెడ్డిని నియమించిన విషయం విదితమే. కమిషన్ ప్రధాన న్యాయ మూర్తి సూర్య భాస్కరం చేతులమీదుగా భరత్‌రెడ్డి నియామక పత్రం అందుకున్నారు.ఈనేపధ్యంలో సోమవారం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో భరత్‌రెడ్డిని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు కలసి దుశ్వాలువ, పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా భరత్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం శ్రీకాళహస్తి ఆర్డీవో కెఎస్.రామారావును మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

# తడలో మళ్లీ మొదలైన వర్షం - రైతన్నల్లో భయం



తడ, డిసెంబర్ 26 ప్రభాతవార్త : తడ ప్రాంతంలో మళ్లీ వర్షాలు మొదలవడంతో రైతన్నల గుండె గుభేలుమంటోంది. ఇప్పటికీ వరద నీటిలోనే ఉన్న పంట పొలాలు ఈ వర్షంతో మరింత మునిగిపోతాయని రైతులు భయపడుతున్నారు. ఇప్పటికే తమిళనాడులో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరోసారి అల్పపీడనం పుట్టిందని, మూడురోజుల పాటు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేయడంతో సరిహద్దు గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. దీనికితోడు వర్షం ప్రభావం వల్ల వరిపంటకు తెగుళ్ల పీడ ఎక్కువ అవుతుందని రైతులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 80 రోజులు మించిన ముదురు వరిపైరుపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని రైతన్నలు తెలిపారు. ఎన్నుతీసే సమయంలోనూ పంటకు పాలుకూరే సమయంలోనూ జోరుగా వర్షం కురిస్తే మెదవిరుపు, రెల్ల విరిగి పడిపోవడం వంటివి జరుగుతాయని తద్వారా పంట నష్టం జరుగుతుందని రైతులు తెలిపారు. ఏపుగా ఎదిగిన పంట భారీ వర్షం కురిస్తే పడిపోయే ప్రమాదం లేకపోలేదని తెలిపారు. ముదురు పైరు కలిగిన రైతులు ఈ విధంగా భయపడుతుంటే లేతపైరు ఉన్న రైతులు పంట మునిగిపోతే కుళ్లిపోతుందని ఆందోళన చెందుతున్నారు. పల్లపు ప్రాంతాల్లో ఇప్పటికీ వరిపంట నీటిలోనే నానుతుండటం వల్ల పులి మీద పుట్రలా అల్పపీడన ప్రభావంతో భారీవర్షాలు కురిస్తే దెబ్బతింటామని రైతులు తెలిపారు. మండలంలోని ఇరకం, వేనాడు దీవులలో అధికారులు పంట పొలాల రీసర్వే నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ రెండు దీవులకు వెళ్లిన అధికారులు, సర్వే సిబ్బంది వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. రీసర్వే పనులకు అంతరాయం కలుగుతోంది.

# పేదల నెత్తిన బిల్లుల పిడుగు !

కోట,డిసెంబర్ 26 ప్రభాతవార్త : జిల్లాలో జగ్జీవన్‌జ్యోతి పథకం కింది ఎస్సీ,ఎస్టీలకు నెలకు 200 యూనిట్లు వరకు ఇచ్చే ఉచిత విద్యుత్ పథకం అనేక మంది అర్హులకు వర్తించకపోవడంతో వారంతా తీవ్ర నిరాశ చెందుతున్నారు.పైగా ఇప్పటికవరకు ఈ పథకం కింద ఉన్న అబ్దిదారుల్లోనూ కోత పెడుతుండటంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.ఈ ఏడాది మే లో ప్రభుత్వం చేయించిన సర్వే ఆధారంగా కొన్ని కనెక్షన్లను అనర్హత జాబితాలో పెట్టేశారు. దీంతో వారంతా అయిదారు నెలలగా బిల్లులు కట్టాల్సి వస్తోంది.ఎస్సీ,ఎస్టీ లభిదారులు నివసించే ఇళ్లలో ఇతరులు ఉంటున్నారా? వారి పేరిట లభఙ్ణ పొందుతున్నారా? ఆధార్‌తో లబ్దిదారుడి సర్వీసు నంబరు అనుసవధానమైందా? ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారా? వారికి వాహనం ఉందా ? స్థానికంగా ఉన్నారా? ఇతర చోట్లు ఉంటున్నారా? తదితర అంశాలపై గత మే, జూన్ నెలలో సన్వే చేపట్టారు. సచివాయాల్లోని సహాయకుల ద్వారాఈ పరిశ్రలన జరిగింది. ఒకరి పేరున రెండు కనెక్షన్లు ఉన్నా.. వేరే వారితో కలిసి ఉన్న వారిని ఒకే ఆధార్ నబందరుతో ఇతత కనెక్షన్లు అనుసందానం వంటి కారాణాలు చూపి జిల్లా వ్యాప్తంగా వేల మందిని అన్హరులగా గుర్తించారు. వారి నుంచి ఇప్పటి వరకు పొందిన రియితీని తిరిగి రాబట్టే చర్యలు చేపట్టారు.దాదపు 4 వేల మందికి ఈ ఉచిత విదునయత్తు పథకం రద్దయినట్లు అధికార వర్గాలు తెలిపారు.

# జనవరిలో మూడో విడత ఆసరా

కోట, డిసెంబర్ 26 ప్రభాతవార్త : స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణమాఫీ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా మూడోవిడత నగదు అందించేందుకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా సభ్యులు నామినీల నుంచి బయోమెట్రిక్ హాజరు ప్రక్రియ పూర్తి చేశారు. గత సార్వత్రిక ఎన్నికలు 2019 ఏప్రిల్ 11 నాటికి బ్యాంకు లింకేజి రుణాలు పొందిన స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు రెండువిడతలు మాఫీ చేశారు. మూడో విడత జనవరిలో చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలో 3,58,100 మంది సభ్యుల నుంచి క్షేత్రస్థాయిలో సేకరించిన ఆధారాలతో సామాజిక ఆడిట్ పూర్తి చేశారు. అనంతరం ఆ జాబితాను ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రదర్శించారు. ఈ జాబితా ఈ నెల 27వ తేదీ వరకు ఉంటుంది. ఇందులో సభ్యులు ఏమైనా సందేహాలు ఉంటే ఫిర్యాదులు చేసుకోవాలి. అనంతరం వాటిని సరిచేస్తారు. ఆ జాబితా ఆధారంగా సంఘ పొదుపు ఖాతాలకు మూడో విడత నగదును ప్రభుత్వం జమ చేయనుంది. తర్వాత బ్యాంకర్లు సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లోకి బదిలీ చేయాల్సి ఉంటుంది. పొదుపు ఖాతా నుంచి నేరుగా సంఘం విత్‌డ్రా చేయకూడదు. సంఘ తీర్మానంతో సభ్యుల ఖాతాల్లోకి బ్యాంకర్లు జమ చేయాలి. ఈ ప్రక్రియ అంతా పూర్తయి జనవరి మొదటి వారంలో సభ్యుల ఖాతాల్లోకి నగదు జమ కానున్నట్లు ఇక్కడి అధికారులు తెలిపారు.

# ఆగిఉన్న కంటైనర్‌ను ఢీకొన్న బొలేరో -ఒకరు మృతి

శ్రీకాళహస్తి రూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం ఆంజనేయ పురం వద్ద ఆగిఉన్న కంటైనర్‌ను బోలేరో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.ఎస్ఐ వెంకటేష్ అందించిన సమాచారం మేరకు వివరాలుఇలా ఉన్నాయి. ఏర్పేడు-వెంకటగిరి మార్గంలోని ఆంజనేయ పురం వద్ద ఆదివారం అర్ధరాత్రి వెంకటగిరి వైపు వెళుతున్న కంటైనర్‌ను ఆపి డ్రైవర్ నిద్రిస్తున్నారు. అదే మార్గంలో వెళుతున్న బోలేరో వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. బొలేరోలో ఉన్న తమిళనాడుకు చెందిన క్లీనర్ వీరరాఘవన్ (52) అక్కడి కక్కడే మృతి చెందారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.